ఘనంగా వీరభద్రస్వామి జాతర

సిర్గాపూర్, ఫిబ్రవరి 14: సిర్గాపూర్‌లో వీరభద్ర స్వామి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వార్షికోత్సవం, వసంత పంచమి సందర్భంగా ఆలయ ధర్మ కర్త కల్యాణరావు పాటిల్, మనీశ్‌పాటిల్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో శివలింగానికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండానికి సంప్రదాయ పూజలు నిర్వహించి, దాంట్లో నడిచారు. కార్యక్రమంలో అర్చకులు బసయ్యస్వామి, నాగయ్యస్వామి, విజయ్‌కుమార్ పాటిల్, జగప్పపాటిల్ తదితర అలూరే పరివార బృందం, గ్రామస్తులు ఉన్నారు.

అగ్నిగుండంలో నడుస్తున్న భక్తుడు

వాల్మీకి మందిర నిర్మాణానికి భూమిపూజ

ఉజలంపాడ్‌లో వాల్మీకి మందిర నిర్మాణానికి భూమి చేసిన గ్రామస్తులు

సిర్గాపూర్, ఫిబ్రవరి 14: ఉజలంపాడ్ గ్రామంలో వాల్మీకి మందిర నిర్మాణానికి బుధవారం భారత జాగృతి జిల్లా యువజన అధ్యక్షుడు అరుణ్‌రాజ్, మాజీసర్పంచ్ శోభావతి, ముదిరాజ్ సంఘం అధ్యర్యంలో భూమి పూజ చేశారు. వసంత పంచమి శుభదినాన్ని పురస్కరించుకొని పూజ చేయ డం ఆనందంగా ఉందని సంఘం సభ్యులు తెలిపారు.ప్రగాబాయి, మొగులప్ప, సంజు, మాదప్ప, హన్మారెడ్డి, హన్మంతు ఉన్నారు.

క్రీడాకారుడికి సన్మానం

కిక్‌బాక్సింగ్ క్రీడాకారుడు మహేశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

హత్నూర, ఫిబ్రవరి14: మండలంలోని సిరిపుర గ్రామానికి చెందిన కిక్‌బాక్సింగ్ క్రీడాకారుడు మహేశ్‌గౌడ్ క్రీడాపోటీల్లో పాల్గొని బుధవారం గ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామస్తులు శాలువా, పూలమాలతో సన్మానించి ఘనస్వాగతం పలికారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ కిక్‌బాక్సింగ్ అండర్-16 విభాగంలో మహేశ్‌గౌడ్ ఎనిమిది దేశాల క్రీడాకారులతో తలపడి రెండు వెండి పతకాలు సాధించాడు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నరేందర్, కిక్‌బాక్సింగ్ కోచ్ పోచయ్య, యాదగిరి, రాజు, మల్లేశం, మహేశ్, నవీన్, హరి, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం

కొండాపూర్, ఫిబ్రవరి14: కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం అన్నారు. బుధవారం కొండాపూర్ మండలంలోని మల్లేపల్లి శివారులోని యూబీ, క్రౌన్ బీరు పరిశ్రమల వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కార్మికులకు కనీస పింఛన్ రూ.10వేలు ఇవ్వాలన్నారు. అర్హులైన కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

అందోల్, ఫిబ్రవరి 14: భూతగాదాల్లో వ్యక్తిని హత్య చేసిన ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట సీఐ అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. సీఐ కార్యాలయంలో ఎస్సై అరుణ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని అల్మాయిపేట్ గ్రామానికి చెందిన మునిరొద్దీన్(55)ను అదే గ్రామానికి చెందిన ఖమ్రోద్దీన్ మధ్య కొన్నేండ్లుగా 1.30 గుంటల భూమి విషయంలో తగాదాలు నడుస్తున్నాయి. సోమవారం మరోసారి పొలం వద్ద గొడవ జరగ్గా ముందే హత్యకు ప్లాన్‌చేసిన ఖమ్రోద్దీన్, అతడి కుటుంబసభ్యులు మునిరొద్దీన్‌పై పార, రాళ్లు, బండరాళ్లతో దాడిచేసి హత్య చేసి పారిపోయారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జోగిపేట పోలీసులు హంతకుల కోసం గాలింపు చేపట్టగా మంగళవారం సంగుపేట వద్ద వారిని పట్టుకున్నారు. హత్యకు పాల్పడిన ఖమ్రోద్దీన్, గఫర్, మహబూబాబేగం, ఖరీమాబేగం, ఖదీర్, దుదేకుల ఆసీయాబేగంలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నీలం మధు చేరికను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ నేతలు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 14: బహుజన సమాజ్ పార్టీ నాయకుడు, చిట్కుల్ మాజీ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో కాంగ్రెస్ అగ్రనాయకుల సమక్షంలో పార్టీలో చేరనున్నారు. ఈమేరకు ఆయన గాంధీభవన్ వరకు పెద్దఎత్తున ర్యాలీగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నీలం మధు కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని అదే పార్టీకి చెందిన కొందరు నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు నియోజకవర్గం ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్‌ను కాదని కాంగ్రెస్ హైకమాండ్ నీలం మధు పేరుని మొదటి లిస్ట్‌లో ప్రకటించింది. ఆ తర్వాత కాట శ్రీనివాస్‌గౌడ్ అనుచరులు తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేయడంతో దిగివచ్చిన హైకమాండ్ కాటాకు టికెట్ ఫైనల్ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నీలం మధు బీఎస్పీ నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిల్చున్నారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓడిపోవడానికి నీలం మధు కారణమని పలువురు కాంగ్రెస్ నాయకులు గుర్రుమంటున్నారు. నీలం మధు కాంగ్రెస్ పార్టీలోకి చేరడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యువజన నాయకుడు ముత్యాల సంజీవ్ వీడియోను సోషల్‌మీడియాలో రిలీజ్ చేశారు. అధిష్టానం పెద్దలు నీలం మధు చేరికపై పునరాలోచించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

పుల్కల్ ఎస్సైగా శ్రీకాంత్

బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీకాంత్

పుల్కల్, ఫిబ్రవరి 14: పుల్కల్ ఎస్సైగా శ్రీకాంత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన పాటిల్ క్రాంతికుమార్ బదిలీపై వెళ్లగా, అదేస్థానంలో సంగారెడ్డి సీసీఎస్‌లో విధులు నిర్వహించిన శ్రీకాంత్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్వయం పాలన

రామచంద్రాపురం, ఫిబ్రవరి14: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తెల్లాపూర్, ఈదులనాగులపల్లి గ్రామాల్లో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. స్వయంపాలన దినోత్సవంతో విద్యార్థులకు ఉపాధ్యాయుల పట్ల గౌరవం, ఉపాధ్యాయ వృత్తి ఎంత విలువలతో కూడుకున్నదో బోధపడుతుందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అన్నారు.

కంది సరస్వతీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ దంపతులు

సంగారెడ్డి : సరస్వతీ మాతకు పూజలు చేస్తున్న పురోహితుడు, నిర్వహిస్తున్న సంగీత విభావరి

ఘనంగా వసంత పంచమి



గుమ్మడిదల : ఎస్‌జీహెచ్‌ఎస్‌లో సరస్వతిదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న ఉపాధ్యాయ బృందం

కంది, ఫిబ్రవరి 14: వసంత పంచమి వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కందిలోని సరస్వతీదేవి ఆలయంలో పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. చదువుల తల్లి సరస్వతీదేవి సమక్షంలో తల్లిదండ్రులు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

కోహీర్‌లో..

కోహీర్, ఫిబ్రవరి 14: కోహీర్ పట్టణంలోని సరస్వతీ శిశుమందిరంలో వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం కోలా టం, నృత్యా లు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.కార్యక్రమం లో పాపిరెడ్డి, సిద్దన్న, జనార్దన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాదయాత్ర, పల్లకీసేవ

రాయికోడ్, ఫిబ్రవరి 14 : వసంత పంచామిని పురస్కరించుకొని రాయికోడ్ మండలంలోని సింగితం గ్రామానికి చెందిన నాగేంద్రర్ చారి, రాజుచారి, అనిల్‌చారి, గ్రామస్తులు పాదయాత్ర, పల్లకీసేవ నిర్వహించారు. సింగితం నుంచి న్యాల్‌కల్ మండలంలోని రాఘవపూర్ గ్రామ శివారులో ఉన్న పంచవటి క్షేత్రంలో ఉన్న సరస్వతీ అమ్మవారి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అమ్మవారికి కిలోన్నర వెండి కిరిటం అందజేశారు. ఈ పాదయాత్రలో పలువురు భక్తులు ఉన్నారు.

ఎస్‌వీహెచ్‌ఎస్‌లో ..

గుమ్మడిదల, ఫిబ్రవరి14: గుమ్మడిదల ఎస్‌వీహెచ్‌ఎస్ పాఠశాలలో ప్రిన్సిపాల్ లతా, కరస్పాండెంట్ జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సరస్వతిదేవి విగ్రహాన్ని వేదపండితుల మంత్రోచ్చారణలతో ప్రతిష్ఠించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో వేదపండితులు నర్సింహాచార్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిన్నారంలో..

జిన్నారం, ఫిబ్రవరి 14 : జిన్నారంలోని ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సార శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

సంగారెడ్డిలో..

సంగారెడ్డి, ఫిబ్రవరి14: సరస్వతి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో వసంత పంచమిని నిర్వహించారు. పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ సరస్వతినగర్‌లో విద్యాసరస్వతీ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, కుంకమార్చనలు, చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్‌మహేంద్ర, మహేశ్‌కుమార్, వినయ్, రాజు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో..

సంగారెడ్డి పట్టణంలోని 30వ వార్డు బాలాజీ నగర్‌లోని హరిహర క్షేత్రం వార్షికోత్సవంలో భాగంగా స్వామివారి కల్యాణాన్ని కనులపండుగగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శారద సంగీత విద్యాలయం శ్వేతాజోషి ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

జడ్పీసీఈవోగా జానకిరెడ్డి బాధ్యతలు

సంగారెడ్డి, ఫిబ్రవరి14: జిల్లా జడ్పీసీఈవోగా జానకిరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు జడ్పీసీఈవోగా విధులు నిర్వహించిన ఎల్లయ్య మెదక్ జిల్లాకు బదిలీ కాగా, జిల్లాకు వికారాబాద్ జడ్పీసీఈవోగా విధులు నిర్వహించిన జానకిరెడ్డి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా జడ్పీసీఈవో మాట్లాడుతూ కొత్తగా జిల్లాకు వచ్చిన తనకు అధికారులు, సిబ్బంది సహకారం అందించాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కోహీర్, ఫిబ్రవరి14: విద్యార్థులు పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని తహసీల్దార్ శాంతకుమారి కోరారు. బుధవారం మండలంలోని దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి పదోతరగతి చదువుతున్న తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. మెరుగైన జీపీఏ సాధించి తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయుల పేరును నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

డీఆర్డీవోగా జ్యోతి బాధ్యతలు

సంగారెడ్డి, ఫిబ్రవరి14: మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ ముఖ్యకార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీపై జిల్లాకు వచ్చిన జ్యోతి బుధవారం జిల్లా పరిషత్‌లోని డీఆర్డీవో చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించా రు. ఇప్పటివరకు ఇక్కడ డీఆర్డీవోగా పనిచేసిన శ్రీనివాస్‌రావు మెదక్ జిల్లాకు బదిలీకావడంతో ఆయన స్థానంలో జ్యోతి వచ్చారు. త్వరలో జరుగనున్న పార్లమెం టు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులను బదిలీ చేశారు.

రాష్ట్రస్థాయి అవార్డులకు నామినేషన్లు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 14: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అవార్డులకు నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా రాష్ట్ర స్థాయి అవార్డుల ఎంపిక కోసం నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ఔత్సాహికులైన మహిళలు దరఖాస్తులను ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అన్ని పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఆమె స్పష్టం చేశారు.

రియాక్టర్ పేలుడులో బయటపడిన మృతదేహం

- యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం
- చికిత్స పొందుతున్న నలుగురు కార్మికులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 14: మంగళవారం రాత్రి జరిగిన రియాక్టర్ పేలుడు ప్రమాదంలో ఒక కార్మికుడి మృతదేహం లభించింది. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడ ఫేస్ 1లోని సీఎంహెచ్ పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో యూపీకి చెందిన శ్యామ్‌బాబు (22) శవం లభ్యమైంది. రాత్రి మంటలను అదుపు చేసే సమయంలో శ్యాం బాబు మృతదేహం కనిపించ లేదు. శ్యామ్‌బాబు ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. సీఎంహెచ్ అగ్ని ప్రమాదం పక్కనున్న వనమాలి పరిశ్రమపైన ప్రభావం చూపింది. మంటల తీవ్రతకు సాల్వెంట్ డ్రమ్ములు గాలిలో ఎగిరిపేలిపోయాయి. వాటిలోనుంచి పడిన డ్రమ్ములతో వనమాలి కంపెనీలోను అగ్ని రాజుకుంది. ఫైర్ ఇంజిన్లు వచ్చి అర్ధరాత్రి వరకు శ్రమించి మంటలు ఆర్పాయి. ఒక దశలో మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్ని ప్రమాదం మరిన్ని పరిశ్రమలపై ప్రభావం చూపుతుందని పారిశ్రామికవేత్తలు ఆందోళన చెందారు. మంటలఆర్పే ఫోమ్‌ను చల్లడంతో అదుపులోకి వచ్చాయి. దీంతో పారిశ్రామిక వాడ ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. నలుగురు కార్మికులకు తీవ్రగాయాలు కావడంతో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స అందజేస్తున్నారు. శ్యాంబాబు మృతి చెందడంతో శవాన్ని పంచనామా చేసేందుకు పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించారు. కేసును బీడీఎల్ సీఐ రవీందర్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం ఉందని స్థానికులు మండిపడుతున్నారు. మరణించిన కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

గాయపడిన వారిని పరామర్శించిన మంత్రి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 14: పాశమైలారం పారిశ్రామికవాడలో మంగళవారం రాత్రి సీఎంహెచ్, వనమాలి పరిశ్రమల్లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో తీవ్రగాయాలైన కార్మికులను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పరామర్శించారు. పటాన్‌చెరు పట్టణంలో చికిత్స పొందుతున్న కార్మికులను మంత్రి బుధవారం పరామర్శించి, ప్రమాదం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశ్రమలో ప్రమాదం దురదృష్టకరమన్నారు. పరిశ్రమల యజమానులు భద్రతపై దృష్టి సారించాలన్నారు. పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా పరిశ్రమల భద్రతాధికారులకు అప్రమత్తం చేస్తామన్నారు. ప్రమాదం జరిగిన విధానంపై నివేదిక ఇవ్వాలని చెప్పారు. 4 వందల పరిశ్రమలున్న చోట సేఫ్టి ప్రధానంగా ఉండాలని కలెక్టర్‌తో వల్లూరు క్రాంతితో అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, అవినాశ్ గౌడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రాళ్లకుప్పల్లో పసికందు

ముదిమాణిక్యం సమాధుల ప్రక్కన రాళ్లకుప్పల్లో పడేసిన ప్రాంతం

పుల్కల్, ఫిబ్రవరి 14: నవమాసాలు మోసిన బిడ్డను ఓ తల్లి గ్రామంలోని రాళ్ళకుప్పల్లో పడేసిన ఘటన బుధవారం మండలపరిధిలోని ముదిమాణిక్యం గ్రామంలో చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని రామ మ్మ కూతురు ఎల్లమ్మ భర్తను వదిలేసి అమ్మగారింట్లో కొన్నేండ్లుగా ఉంటుంది. బుధవారం ఎల్లమ్మ మగబిడ్డకు జన్మనిచ్చింది. భర్త లేని బిడ్డ భారం అనుకొని ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో ఆ బిడ్డను తీసుకెళ్లి రాళ్లకుప్పల్లో పడేసింది. అటుగా వెళ్తున్న గ్రామస్తులు ఏడుపు విని, గ్రామ మజీ సర్పంచ్ పడమటి అరుణాయాదగిరి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మికి సమాచారం ఇచ్చారు. వారు 108 సిబ్బందికి, 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వగా పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పసికందును చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం తల్లి ఎల్లమ్మను కౌన్సెలింగ్ కోసంచైల్డ్‌వెల్ఫేర్‌కు తరలించారు. సెక్షన్ 317 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

సత్వర న్యాయానికి లోక్‌అదాలత్‌లు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు

సంగారెడ్డి, ఫిబ్రవరి14: లోక్ అదాలత్‌ల్లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు పరిష్కరించేలా కృషి చేయాలని, కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు అన్నారు. బుధవారం జిల్లా కోర్టులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు ఆధ్వర్యంలో పోలీసులు, కోర్టు కానిస్టేబుళ్లతో జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువగా క్రిమినల్ కంపౌండబుల్ కేసుల పరిష్కారానికి కృషి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో న్యాయమూర్తులు సుదర్శన్, సునీతారవీందర్‌రెడ్డి, కృష్ణార్జున, లావణ్య, హన్మంతరావు, లక్ష్మణాచారి, అనితాదామోదర్ రాపోలు, తేజశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి

సంగారెడ్డి, ఫిబ్రవరి14: ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెరిగిన వేతనాలు చెల్లించి కాంట్రాక్టు వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో కార్మికుల జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ కార్మికులకు పెరిగిన వేతనం అమలు చేయాలని, అన్ని దవాఖానల్లో ప్రభుత్వం నిర్ణయించిన రూ.15,600లలో కార్మికుడికి రూ.12,093 చెల్లించి మిగిలినవి పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్మికుడికీ ఐడీకార్డు, యూనిఫాం, ఇతర పరికరాలు ఇవ్వాలన్నారు. నాయకులు యాదగిరి, కిరణ్, శోభ, మనియమ్మ, రమాదేవి, అలీమా, రత్నయ్య, సునీత, అనిత, నిఖిత, రాజు పాల్గొన్నారు.

తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా సంగారెడ్డి

సంగారెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

రామచంద్రాపురం/బొల్లారం, ఫిబ్రవరి 14: తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా బుధవారం సంగారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమ య్య జీహెచ్ఎంసీకి బదిలీపై వెళ్లడంతో బొల్లారం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంగారెడ్డి తెల్లాపూర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది సన్మానించారు. బొల్లారం మున్సిపల్ కమిషనర్‌గా మంగతాయారును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆమె జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

కోహీర్ ఎంపీడీవోగా భారతి

కోహీర్, ఫిబ్రవరి14 : కోహీర్ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల అభివృద్ధి అధికారిగా భారతి బాధ్యతలు స్వీకరించారు. మెదక్ జిల్లా కౌడిపల్లి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన భారతి బదిలీపై కోహీర్‌కు వచ్చారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, టీఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో రఘు, ఏపీవో సునందరావు, కార్యదర్శులు, టీఏలు పాల్గొన్నారు.

రాయికోడ్ ఎంపీడీవోగా షరీఫ్

రాయికోడ్, ఫిబ్రవరి 14: రాయికోడ్ ఎంపీడీవోగా ఎంఎం షరీఫ్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం మండలకేంద్రమైన రాయికోడ్ ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఇంతకుముందు ఎంపీడీవోగా విధులు నిర్వహించిన వెంకటేశం నల్లగొండకు బదిలీపై వెళ్లారు. నల్లగొండ నుంచి షరీఫ్ రాయికోడ్‌కు వచ్చారు. కార్యక్రమం లో సిబ్బంది రామకృష్ణ, రమేశ్, విష్ణు, శ్యామ్, తుకప్ప, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంది ఎంపీడీవోగా శ్రీనివాస్

కంది, ఫిబ్రవరి 14: మండల ఎంపీడీవోగా శ్రీనివాస్ బుధవారం బాధ్యత లు స్వీకరించారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో విధులు నిర్వహించిన శ్రీనివాస్ బదిలీపై కందికి వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన విశ్వప్రసాద్ వికారాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కొండాపూర్ ఎంపీడీవోగా జ్యోతిలక్ష్మి

కొండాపూర్, ఫిబ్రవరి14: కొండాపూర్ మండల అభివృద్ధి అధికారిగా జ్యోతిలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నుంచి కొండాపూర్‌కు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన మధులత మొదక్ జిల్లాలోని నర్సాపూర్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ప్రతి అధికారి గ్రామాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు.

గుమ్మడిదల ఎంపీడీవోగా ఉమాదేవి

గుమ్మడిదల, ఫిబ్రవరి14: గుమ్మడిదల ఎంపీడీవోగా ఉమాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు రామాయంపేట ఎంపీడీవోగా విధులు నిర్వహించి బదిలీపై గుమ్మడిదలకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవోను గ్రామాల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, గుమ్మడిదల మాజీసర్పంచ్ నర్సింహారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో దయాకర్‌రావు, ఈవోలు శ్రీనివాస్‌రెడ